తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | శుక్రవారం - 17- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 43 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

# హరిత రవాణాలో కొత్త అధ్యాయం

- హైడ్రోజన్ రైలుకు పచ్చజెండా
- రేపు ప్రారంభించనున్న ప్రధాని
- పర్యావరణ హిత రవాణాకు శ్రీకారం




డెస్క్, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):

భారతీయ రైల్వే రంగంలో పర్యావరణ హిత రవాణాకు నాంది పలికే తొలి హైడ్రోజన్ ఇంధన రైలు ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. దేశంలోనే తొలి హైడ్రోజన్ ఆధారిత రైలును జూలై 17న(నేడు) హర్యానాలోని జింద్ రైల్వే స్టేషన్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ రైలు సేవలు ప్రారంభం కావడంతో హైడ్రోజన్ సాంకేతికతను రైల్వే రంగంలో వినియోగిస్తున్న జర్మనీ, జపాన్, చైనా వంటి దేశాల సరసన భారత్ కూడా చేరనుంది.

జింద్-సోనిపట్ మధ్య 89 కిలోమీటర్ల మార్గంలో ఈ రైలు నడవనుంది. రోజుకు రెండు రౌండ్ ట్రిప్పులు నిర్వహిస్తూ ప్రయాణికులకు సేవలు అందించనుంది. ఉదయం 7.40 గంటలకు జింద్ నుంచి బయలుదేరే ఈ రైలు ఉదయం 9.40 గంటలకు సోనిపట్ చేరుకుంటుంది.

మిగతా 2లో



## మెట్రో రైళ్లలో అదనపు కోచ్‌లు

**ప్రయాణికుల రద్దీ తగ్గించడమే లక్ష్యం**
**మౌలిక సదుపాయాల విస్తరణకు చర్యలు**
**రద్దీ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి**

హైదరాబాద్, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):
హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్) శుభవార్త తెలిపింది. మెట్రో రైళ్లలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఫేజ్-1 నెట్‌వర్క్‌లో అదనపు కోచ్‌లను చేర్చాలని నిర్ణయించింది. ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే మార్గాల్లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం 69 కిలోమీటర్ల మేర విస్తరించిన ఫేజ్-1 కారిడార్‌లో మూడు కోచ్‌లతో కూడిన రైళ్లు నడుస్తున్నాయి. అయితే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడంతో అమీర్‌పేట్, మియాపూర్, రాయదుర్గం, హైటెక్ సిటీ వంటి ప్రధాన స్టేషన్లలో తీవ్ర రద్దీ ఏర్పడుతోంది. దీంతో కొత్త కోచ్‌ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని హెచ్‌ఎంఆర్‌ఎల్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి. అజిత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

మిగతా 2లో



## క్రీడా రంగానికి తెలంగాణలో కొత్త ఊపు

**టీజీ-20 విజేతలకు సీఎం నగదు ప్రోత్సాహం**
**క్రీడా మౌలిక వసతుల బలోపేతమే లక్ష్యం**

హైదరాబాద్, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ రాష్ట్రంలో క్రీడా రంగ అభివృద్ధిని ప్రభుత్వ ప్రాధాన్య అంశంగా తీసుకుని సమగ్ర కార్యాచరణ అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచే యువతను ప్రోత్సహించేందుకు నగదు ప్రోత్సాహకాలు, ప్రభుత్వ ఉద్యోగాలు, ఆధునిక శిక్షణా సదుపాయాలు, అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఇటీవల విజయవంతంగా నిర్వహించిన తొలి సీజన్ టీజీ20 క్రికెట్ లీగ్‌లో విజేతగా నిలిచిన హైదరాబాద్ ఈఛాంపియన్స్ జట్టు సభ్యులు గురువారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను అభినందించిన ముఖ్యమంత్రి వారికి నగదు ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ క్రీడా రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక క్రీడా విధానాన్ని రూపొందించిందన్నారు. ప్రతిభ ఉన్న ప్రతి క్రీడాకారుడికి తగిన అవకాశాలు, శిక్షణ, ప్రోత్సాహం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే యువతకు కూడా సమాన అవకాశాలు కల్పిస్తూ క్రీడలను ప్రతి ఇంటికీ చేరువ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. క్రీడల ద్వారా యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావచ్చని పేర్కొన్నారు.

రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

మిగతా 2లో

## భారత్-యూకే ఒప్పందంతో తెలంగాణకు కొత్త అవకాశాలు

- యూకే ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ
- పెట్టుబడులు, ఎగుమతుల పెంపుపై చర్చ



హైదరాబాద్, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):

భారత్-యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య అమల్లోకి వచ్చిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) ద్వారా తెలంగాణకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి గురువారం సచివాలయంలో యూకే డిప్యూటీ ట్రేడ్ కమిషనర్ (దక్షిణాసియా) చంద్రు కె. అయ్యర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ భారత్-యూకే వాణిజ్య ఒప్పందంతో దేశం నుంచి యూకేకు

మిగతా 2లో



## సీతారామ పనులకు వేగం

**భూసేకరణకు రూ.135 కోట్లు విడుదల**
**ప్రతి ఎకరాకు గోదావరి జలాలే లక్ష్యం**
**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

ఖమ్మం, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాలకుంటలో నిర్మాణంలో ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం ట్రంక్ టన్నెల్ పనులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశమై పనుల పురోగతి, భూసేకరణ, నిధుల విడుదల, నిర్మాణ వేగం, పెండింగ్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ

మిగతా 2లో

## కులవృత్తుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- బోనాల సందర్భంగా కులవృత్తుల మేళా ప్రారంభం
- చేతివృత్తులకు మార్కెట్ అవకాశాల కల్పన
- 60 స్టాళ్లతో ప్రత్యేక ప్రదర్శన

2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# హరిత రవాణాలో కొత్త అధ్యాయం

(మొదటి పేజీ తరువాయి)

జింద్ సిటీ, పాండు పిండర, లలిత్ ఖేరా, భంబేవా, గోహనా తదితర ప్రాంతాలతో కలిపి మొత్తం 12 స్టేషన్లలో ఈ రైలు ఆగనుంది.

చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో రూపొందించిన ఈ రైలులో మొత్తం 10 బోగీలు ఉన్నాయి. వీటిలో రెండు శక్తి కోచ్‌లు, ఎనిమిది ప్రయాణికుల కోచ్‌లు ఉంటాయి. గంటకు గరిష్ఠంగా 75 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ రైలు ఒకేసారి సుమారు 2,600 మంది ప్రయాణికులను తీసుకెళ్లే సామర్థ్యం కలిగి ఉంది. ఈ హైడ్రోజన్ రైలుకు డీజిల్ లేదా విద్యుత్ తీగలు అవసరం ఉండవు. రైలులో ఏర్పాటు చేసిన ఇంధన కణాల్లో నిల్వ ఉంచిన హైడ్రోజన్ వాయువు, గాలిలోని ఆక్సిజన్‌తో రసాయన చర్య జరిపి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఆ విద్యుత్తుతోనే రైలు నడుస్తుంది. ఈ ప్రక్రియలో కార్బన్ ఉద్గారాలు వెలువడకుండా కేవలం నీటి ఆవిరి, వేడి మాత్రమే విడుదల కావడం వల్ల ఇది పూర్తిగా పర్యావరణ హిత సాంకేతికతగా గుర్తింపు పొందింది.

ఈ రైలు నిర్వహణ కోసం జింద్‌లో ప్రత్యేకంగా మూడు వేల కిలోగ్రాముల సామర్థ్యం గల హైడ్రోజన్ ఉత్పత్తి, నింపే కేంద్రాన్ని రైల్వే శాఖ ఏర్పాటు చేసింది. హైడ్రోజన్ నిల్వ, సరఫరా, భద్రతా ప్రమాణాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేసినట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో దేశంలోని ఇతర మార్గాల్లో కూడా ఇలాంటి హైడ్రోజన్ రైళ్లను ప్రవేశపెట్టేందుకు రైల్వే శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

పర్యావరణ పరిరక్షణ, ఇంధన వ్యయాల తగ్గింపు, కార్బన్ ఉద్గారాల నియంత్రణ లక్ష్యాలతో భారతీయ రైల్వే ఈ వినూత్న అడుగు వేసిందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే దేశవ్యాప్తంగా మరిన్ని హైడ్రోజన్ రైళ్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని, స్వచ్ఛమైన రవాణా వ్యవస్థ అభివృద్ధిలో ఇది కీలక మైలురాయిగా నిలవనుందని పేర్కొన్నారు.

# భారత్-యూకే ఒప్పందంతో తెలంగాణకు కొత్త అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి)



ఎగుమతి అయ్యే 99 శాతం పారిశ్రామిక ఉత్పత్తులపై సుంకాలు తొలగించబడటంతో ఎగుమతులకు విస్తృత అవకాశాలు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ ఒప్పందం వల్ల రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం గణనీయంగా పెరుగుతుందని, సుమారు 25 బిలియన్ పౌండ్ల (రూ.32.56 లక్షల కోట్ల) వాణిజ్య అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో పారిశ్రామిక తయారీ, జీవ విజ్ఞాన శాస్త్రాలు, విమానయాన రంగం, రక్షణ ఉత్పత్తులు, సమాచార సాంకేతిక రంగం, సెమీకండక్టర్లు, చిప్ రూపకల్పన, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులకు అత్యంత అనుకూల పరిస్థితులు ఉన్నాయని మంత్రి వివరించారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని, యూకే పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆహ్వానించారు.

ప్రస్తుతం తెలంగాణ నుంచి యూకేకు రూ.3,553 కోట్ల విలువైన ఎగుమతులు జరుగుతున్నాయని, కొత్త వాణిజ్య ఒప్పందంతో ఈ సంఖ్యను మరింతగా పెంచుకునే అవకాశం ఉందని తెలిపారు. దేశంలో తయారయ్యే ఔషధ ఉత్పత్తుల్లో 40 శాతం తెలంగాణలోనే ఉత్పత్తి అవుతున్నాయని, వ్యాక్సిన్ ఎగుమతుల్లో రాష్ట్రం 30 శాతం వాటాను కలిగి ఉందని పేర్కొన్నారు. విమానయాన రంగానికి అవసరమైన అత్యాధునిక విడిభాగాల తయారీలో తెలంగాణ దేశంలో అగ్రగామిగా నిలిచిందని శ్రీధర్ బాబు చెప్పారు. ఎయిర్‌బస్, బోయింగ్, రోల్స్‌రాయిస్, ప్రాట్ అండ్ విట్నీ, దసో వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థల విమాన విడిభాగాల తయారీ, మరమ్మతు కేంద్రాలు రాష్ట్రంలో ఉండటం తెలంగాణ పారిశ్రామిక సామర్థ్యానికి నిదర్శనమని వివరించారు.

సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. భారత్-యూకే వాణిజ్య ఒప్పందం ద్వారా తెలంగాణ పారిశ్రామిక, ఆర్థిక రంగాలకు కొత్త అవకాశాలు లభిస్తాయని, ఈ అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు. సమావేశంలో యూకే ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మెట్రో రైళ్లలో అదనపు కోచ్‌లు

(మొదటి పేజీ తరువాయి)



ప్రయాణికుల సేవలు, మౌలిక సదుపాయాలపై నిర్వహించిన సమీక్ష అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. అదనపు కోచ్‌లతో పాటు స్టేషన్ల వెలుపల రవాణా సౌకర్యాలను కూడా మెరుగుపరచాలని నిర్ణయించారు. మొదటి, చివరి మైలు అనుసంధాన సేవలను బలోపేతం చేసేందుకు టీఎస్‌ఆర్టీసీ, రవాణా శాఖతో సమన్వయం పెంచాలని సూచించారు. మెట్రో స్టేషన్ల వద్ద పాదచారుల రాకపోకలను సులభతరం చేయడం, స్కైవాక్‌ల నిర్వహణను మెరుగుపరచడం, రద్దీ నియంత్రణకు వినూత్న చర్యలు అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రయాణికులకు వేగవంతమైన, సురక్షితమైన ప్రయాణ అనుభవం కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్ మాట్లాడుతూ ప్రయాణికుల భద్రత, నాణ్యమైన సేవలు, స్టేషన్ల పరిశుభ్రత తమ తొలి ప్రాధాన్యమని తెలిపారు. నగరంలో ప్రజారవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి దీర్ఘకాలిక ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ఐటీ కేంద్రాలను అనుసంధానించే ప్రజా వేగవంత రవాణా వ్యవస్థ ప్రతిపాదనను కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో భవిష్యత్తులో నగర ప్రజలకు మరింత మెరుగైన మెట్రో సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.



# క్రీడా రంగానికి తెలంగాణలో కొత్త ఊపు

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా గచ్చిబౌలి స్టేడియాన్ని అభివృద్ధి చేస్తున్నామని, క్రీడాకారులకు అత్యాధునిక శిక్షణ అందించేందుకు ప్రత్యేక స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని వెల్లడించారు. ప్రతి జిల్లాలో క్రీడా మైదానాలు, శిక్షణా కేంద్రాలు, అవసరమైన సౌకర్యాలను అభివృద్ధి చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. గతంలో హైదరాబాద్ అనేక జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు వేదికగా నిలిచిందని, ఆ వైభవాన్ని మరింత పెంచే దిశగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

టీజీ20 క్రికెట్ లీగ్ యువ క్రికెటర్లకు తమ ప్రతిభను చాటుకునేందుకు అద్భుతమైన వేదికగా నిలిచిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసి వారికి ఉన్నత స్థాయి అవకాశాలు కల్పించడంలో ఈ లీగ్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. హైదరాబాద్ ఈఛాంపియన్స్ జట్టు సాధించిన విజయం రాష్ట్ర యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భవిష్యత్తులో మరింత కష్టపడి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగాలని జట్టు సభ్యులకు ఆకాంక్షలు తెలిపారు.

ఏ రంగంలోనైనా విజయాన్ని సాధించాలంటే లక్ష్యంపై పూర్తి ఏకాగ్రత, క్రమశిక్షణ, అంకితభావం తప్పనిసరిగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతిభ ఒక్కటే సరిపోదని, నిరంతర సాధన, కష్టపడి పనిచేసే తత్వం, తాము ఎంచుకున్న రంగంపై గౌరవం ఉంటేనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని క్రీడాకారులకు సూచించారు. విజయాలతో పాటు అపజయాలను కూడా సమానంగా స్వీకరిస్తూ ముందుకు సాగాలని, ప్రతి సవాలును అవకాశంగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడా రంగంలో తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలబెట్టేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతిభ ఉన్న ప్రతి యువ క్రీడాకారుడికి ప్రభుత్వం తోడుగా నిలిచి అవసరమైన ప్రోత్సాహం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈనాడు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ కిరణ్, ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, హైదరాబాద్ ఈఛాంపియన్స్ జట్టు సభ్యులు, క్రీడా శాఖ అధికారులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# సీతారామ పనులకు వేగం

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు శాశ్వత సాగునీరు అందించడం, గోదావరి జలాలను చివరి ఆయకట్టుకు చేరవేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని అత్యంత ప్రాధాన్యంతో పూర్తి చేసి రాష్ట్ర వ్యవసాయ రంగానికి కొత్త ఊపు తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేసేందుకు రూ.135 కోట్ల నిధులను వెంటనే విడుదల చేసి రైతులకు పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. భూసేకరణకు సంబంధించిన పెండింగ్ అంశాలను ఆలస్యం లేకుండా పూర్తి చేసి నిర్మాణ పనులకు ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. పనులను వేగంగా పూర్తి చేస్తున్న నిర్మాణ సంస్థలకు బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లిస్తూ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేస్తామని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సీతారామతో పాటు రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న అన్ని నీటిపారుదల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు.

సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతులకు శాశ్వత ప్రయోజనం కలుగుతుందని నాయకులు తెలిపారు. పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కులవృత్తుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**హైదరాబాద్, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):**



రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా హెచ్ఎండీఏ మైదానంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కులవృత్తుల మేళాను ప్రారంభించారు. సంప్రదాయ కులవృత్తులను ప్రోత్సహించడంతో పాటు వాటికి మార్కెట్ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. కులవృత్తుల మేళాలో వివిధ కులాలకు చెందిన చేతివృత్తిదారులు తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మొత్తం 60 స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ మేళా 15 రోజుల పాటు కొనసాగుతుందని, ప్రజలు పెద్ద సంఖ్యలో సందర్శించి కళాకారులను ప్రోత్సహించాలని కోరారు.

బోనాల ఉత్సవాల సందర్భంగా పర్యావరణ హిత విధానాలకు ప్రాధాన్యం ఇస్తూ మట్టి కుండలు, మట్టి దీపాలను వినియోగించేలా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. సంప్రదాయ వృత్తులను కాపాడుతూ కళాకారుల జీవనోపాధిని బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మేళాలోని అన్ని స్టాళ్లను సందర్శించిన మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ కులవృత్తుల కళాకారులతో మాట్లాడి వారి ఉత్పత్తులను పరిశీలించారు. పూసర్ల వర్గానికి చెందిన కళాకారులు అందించిన గాజుల బుట్టను స్వీకరించి, వారి స్టాల్‌లో పూసల దండలను కొనుగోలు చేసి ఎమ్మెల్యేల సతీమణులకు బహుమతిగా అందజేశారు.



కులవృత్తులు తెలంగాణ సంస్కృతిలో విడదీయరాని భాగమని, వాటిని ఆధునిక మార్కెట్‌తో అనుసంధానం చేసి కళాకారుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి మేళాలు సంప్రదాయ వృత్తులకు కొత్త ఊపిరి పోస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఈర్లపల్లి శంకర్, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కళాకారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్లపై వినతి

- **టీపీసీసీకి జేఏసీ విజ్ఞప్తి**
- **33 శాతం అమలుకు డిమాండ్**
- **తక్షణ అమలుకు ఒత్తిడి కోరుతూ పిలుపు**

**హైదరాబాద్, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):**



మహిళలకు పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్లను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే అమలు చేయాలని మహిళా రిజర్వేషన్ సంయుక్త కార్యాచరణ కమిటీ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కోరింది. ఈ మేరకు మహిళా సంఘాల ప్రతినిధులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. మహిళా రిజర్వేషన్ల అమలును జనగణన, నియోజకవర్గాల పునర్విభజనతో అనుసంధానం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు జేఏసీ తెలిపింది. రాజ్యాంగ సవరణ ద్వారా ఆ షరతులను తొలగించి రిజర్వేషన్లను వెంటనే అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేసింది. మహిళా రిజర్వేషన్లు స్వతంత్ర అంశమని, వాటిని ఇతర రాజకీయ లేదా పరిపాలనా ప్రక్రియలతో అనుసంధానం చేయడం వల్ల అమలు మరింత ఆలస్యమవుతుందని జేఏసీ అభిప్రాయపడింది. రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ అంశంపై తగిన సవరణలు తీసుకురావాలని కోరింది.

దేశంలోని వివిధ రాష్ట్రాల్లో త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ల అమలు అత్యవసరమని జేఏసీ పేర్కొంది. రాష్ట్ర శాసనసభల్లో మహిళల ప్రాతినిధ్యం ఇంకా తక్కువగానే ఉందని, దీనిని పెంచేందుకు తక్షణ చర్యలు అవసరమని అభిప్రాయపడింది. ఈ డిమాండ్‌ను కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో బలంగా ప్రస్తావించి, మహిళా రిజర్వేషన్ల అమలుకు చొరవ తీసుకోవాలని జేఏసీ విజ్ఞప్తి చేసింది. ఈ అంశంపై మహేష్‌కుమార్ గౌడ్ గతంలోనూ అనుకూలంగా స్పందించిన విషయాన్ని ప్రతినిధులు గుర్తు చేశారు.

ఈ వినతిపత్రంపై వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు సంతకాలు చేశారు. మహిళల రాజకీయ సాధికారత కోసం 33 శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని వారు మరోసారి ప్రభుత్వాన్ని కోరారు.

# బోనాల భద్రతపై సమీక్ష

- **జగదాంబికకు సజ్జనార్ ప్రత్యేక పూజలు**
- **భక్తుల భద్రతే తొలి కర్తవ్యం**
- **ఉత్సవ ఏర్పాట్లపై ఆరా**

**హైదరాబాద్, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):**





గోల్కొండ ఆషాఢ మాస బోనాల సందర్భంగా పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్ జగదాంబిక మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవానికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలు విజయవంతంగా జరగాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తుల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

భక్తుల భద్రతే తమ తొలి కర్తవ్యమని సజ్జనార్ పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే నేపథ్యంలో అన్ని ప్రాంతాల్లో పటిష్ఠ భద్రతా చర్యలు అమలు చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రాకపోకలు, అత్యవసర సేవల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అన్నారు. బోనాల ఉత్సవాలు తెలంగాణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవానికి ప్రతీక అని పేర్కొన్న సజ్జనార్, ప్రతి భక్తుడు ప్రశాంత వాతావరణంలో అమ్మవారిని దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు ఉండాలని ఆకాంక్షించారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులు పోలీసు శాఖ సూచనలను పాటిస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భక్తులందరూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# ఎస్ఐఆర్ సహాయ కేంద్రం పరిశీలన

- **ఓటర్లకు మార్గదర్శకత్వంపై దృష్టి**
- **అర్హులందరికీ సహకారం అందించాలి**
- **బీజేపీ కార్యాలయంలో సమీక్ష**

**హైదరాబాద్, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):**




తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నాంపల్లిలోని తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) సహాయ కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను సమీక్షించారు. ఓటర్లకు అందుతున్న సహాయంపై స్వచ్ఛంద కార్యకర్తలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సహాయ కేంద్రం ద్వారా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల నింపడం, సమర్పించడం, ఓటరు జాబితాలో పేర్లను ధ్రువీకరించుకోవడం, ఓటరు మ్యాపింగ్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా ఓటర్లు తమ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్‌వో), సహాయ ఎన్నికల నమోదు అధికారి (ఏఈఆర్‌వో), బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) వివరాలను కూడా ఈ కేంద్రం ద్వారా తెలుసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఓటర్లకు సేవలు అందిస్తున్న స్వచ్ఛంద కార్యకర్తలను రాంచందర్ రావు అభినందించారు. ప్రతి అర్హుడైన ఓటరికి సరైన సమాచారం, అవసరమైన సహాయం అందేలా నిబద్ధతతో పనిచేయాలని వారికి సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు తన వివరాలను సక్రమంగా నమోదు చేసుకునేలా సహకరించాలని కోరారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ విజయవంతం కావడానికి ప్రజలతో పాటు స్వచ్ఛంద కార్యకర్తలు కూడా చురుకుగా పాల్గొనాలని రాంచందర్ రావు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి అర్హుడైన ఓటరు నమోదవడం ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.

# జగన్నాథ రథయాత్రకు మంత్రి శ్రీకారం

- **కూకట్‌పల్లిలో భక్తి పారవశ్యం**
- **భక్తులతో కలిసి రథాన్ని లాగిన మంత్రి**

**హైదరాబాద్, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గురువారం కూకట్‌పల్లిలో ఇస్కాన్ ఆలయం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర-2026ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి జగన్నాథ స్వామివారి ఆశీస్సులు పొందారు.

రథయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి జగన్నాథ స్వామివారి రథాన్ని లాగుతూ రథయాత్రలో పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు "జై జగన్నాథ్", "హరే రామ", "హరే కృష్ణ" నామస్మరణలతో భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. రథయాత్ర మార్గమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భజనలు, సంకీర్తనలు, హరినామ స్మరణలతో కూకట్‌పల్లి ప్రాంతం మార్మోగింది. భక్తుల ఉత్సాహం మధ్య మంత్రి దామోదర్ రాజనర్సింహ స్వయంగా స్వామివారి ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేసి ఆశీర్వాదాలు అందించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగన్నాథ రథయాత్ర భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం పెంపొందించడంలో ఇలాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని జగన్నాథ స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది పాల్గొని జగన్నాథ రథయాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.







## నాలెడ్జ్ సిటీలో విషాదం

- **సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య**
- **సైబర్ మోసమే కారణమా?**
- **అన్ని కోణాల్లో పోలీసుల దర్యాప్తు**

**హైదరాబాద్, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):**



రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని నాలెడ్జ్ సిటీలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. బెంగళూరుకు చెందిన తిరువీధి అవినాశ్ (40) మృతి స్థానికంగా, సహోద్యోగుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసుల వివరాల ప్రకారం, అవినాశ్ రెండు నెలల క్రితమే తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కు వచ్చారు. నాలెడ్జ్ సిటీలోని ఓ ప్రముఖ సమాచార సాంకేతిక సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం సాయంత్రం కార్యాలయం నుంచి బయలుదేరుతున్నట్లు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసినప్పటికీ రాత్రి వరకు ఇంటికి చేరుకోలేదు.

ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గాలించగా, కార్యాలయ భవనం వెనుక భాగంలో రక్తపు మడుగులో అవినాశ్ మృతదేహం కనిపించింది. భవనంలోని నాలుగో అంతస్తులో ఉన్న ప్లే ఏరియా నుంచి ఆయన కిందకు దూకినట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఇటీవల జరిగిన ఓ సైబర్ మోసంలో అవినాశ్ సుమారు రూ.2 లక్షలు కోల్పోయినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఆర్థిక నష్టం కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత పరిస్థితులు, ఇతర కారణాలపై కూడా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, సహోద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, లింకులు, ఆర్థిక లావాదేవీల విషయంలో జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు.



## జాతర ఏర్పాట్లపై కేంద్ర మంత్రి సమీక్ష

- **కుటుంబంతో స్వామి దర్శనం**
- **ఆలయ అభివృద్ధికి హామీ**
- **భక్తుల సౌకర్యాలపై దృష్టి**

జగిత్యాల, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామంలోని తమ ఇంటి దైవం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితులు ఆశీర్వచనం అందించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. జాతర సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను వేదపండితులు, ఆలయ ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సౌకర్యాల కల్పనతో పాటు ఘాట్ రహదారి అభివృద్ధి అవసరాన్ని వివరించారు.

భక్తుల సౌకర్యార్థం వాటర్ ప్లాంట్ ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని బండి సంజయ్ హామీ ఇచ్చారు. గుట్టపై ఉన్న ఆలయ ప్రాంగణంలో తగిన లైటింగ్ సౌకర్యం కల్పించే విషయంలో కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆలయానికి వెళ్లే ఘాట్ రోడ్డును అభివృద్ధి చేసే అంశాన్ని సంబంధిత అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు చేపడతామని మంత్రి పేర్కొన్నారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారిని దర్శించుకునేలా సౌకర్యాలు కల్పించడంపై దృష్టి సారిస్తామని చెప్పారు.

జాతర సమయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా మౌలిక వసతులు మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన అంశాల్లో తనవంతు సహకారం అందిస్తానని బండి సంజయ్ మరోసారి స్పష్టం చేశారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా ఆలయానికి వచ్చే యాత్రికులకు మరింత అనుకూల వాతావరణం కల్పించాలన్నారు.



## సహకార రంగంపై ఇరాన్‌కు తెలంగాణ నమూనా

- **ఇరాన్ ప్రతినిధులతో మంత్రి తుమ్మల భేటీ**
- **సహకార వ్యవస్థ బలోపేతంపై చర్చలు**

**హైదరాబాద్, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సహకార రంగం పనితీరు, రైతు సంక్షేమంలో సహకార సంఘాల పాత్రను ఇరాన్ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందానికి రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి గురువారం సచివాలయంలో ఇరాన్ ప్రతినిధి బృందంతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

ఈ సమావేశంలో ఇరాన్ సహకార, కార్మిక, సామాజిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మెయిదారి, సహకార శాఖ ఉపమంత్రి డాక్టర్ సర్ఫీ, భారత దేశంలోని ఇరాన్ రాయబారి డాక్టర్ మొహమ్మద్ ఫత్హ్ అలీ, హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సుల్ జనరల్ హమీద్ అహ్మదియెహ్, వైస్ కాన్సుల్ మొహ్సిన్ మొఘద్దామి, ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి హషెమీ తదితరులు పాల్గొన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలంగాణలో ప్రభుత్వం చేపట్టిన సహకార రంగ సంస్కరణలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పనితీరు, సభ్యత్వ విస్తరణ, రైతులకు అందిస్తున్న సేవలను ప్రతినిధి బృందానికి వివరించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, రైతు సంక్షేమ కార్యక్రమాల అమలులో వాటి పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## ఓటు హక్కును నిర్లక్ష్యం చేయొద్దు.. ప్రతి అర్హుడు నమోదు చేసుకోవాలి





**జమ్మికుంట టౌన్ జులై 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రతి ఓటు హక్కు కలిగిన వ్యక్తి సద్వినియోగం చేసుకోవాలని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం పిలుపునిచ్చారు.

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పారదర్శకంగా, తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వారు తమ వివరాలను మరోసారి పరిశీలించుకోవాలని సూచించారు.

బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించే సమయంలో ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. అవసరమైన పత్రాలను సమర్పించి ఓటరు జాబితా ఖచ్చితత్వానికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్న స్వప్న సదానందం, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరికి కీలక బాధ్యత ఉందన్నారు. ప్రతి అర్హుడు ఓటరుగా నమోదు కావడంతో పాటు తన వివరాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.




## గోవులకు రక్షణ–ప్రజలకు భద్రత.. జమ్మికుంటలో గోశాల ఏర్పాటుకు చేయాలి

**జమ్మికుంట టౌన్ జులై 16 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలో శాశ్వత గోశాల ఏర్పాటు చేయాలని కోరుతూ పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్ మున్సిపల్ చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులకు పట్టణ ప్రజల తరఫున విజ్ఞప్తి చేశారు.


పట్టణ అభివృద్ధి కోసం మున్సిపల్ పాలకవర్గం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అభినందించిన ఆమె, ప్రస్తుతం రోడ్లపై సంచరిస్తున్న గోవుల సంరక్షణకు శాశ్వత పరిష్కారం అవసరమని పేర్కొన్నారు. గోవులు ప్లాస్టిక్ కవర్లు, విషపూరిత వ్యర్థాలు, మిగిలిపోయిన ఆహార పదార్థాలు తిని అనారోగ్యానికి గురవుతున్నాయని, రహదారులపై సంచరించడం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటమే కాకుండా ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు గోశాల ఏర్పాటు కోసం తగిన స్థలాన్ని గుర్తించి కేటాయించడంతో పాటు అవసరమైన చర్యలను తక్షణమే ప్రారంభించాలని ఆమె కోరారు.

గోమాతల సంరక్షణ కేవలం సామాజిక బాధ్యత మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొంటూ, ఈ కార్యక్రమాన్ని చేపట్టి జమ్మికుంటను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దాలని పట్టణ ప్రజల ఆకాంక్ష అని పూదరి రేణుక శివకుమార్ గౌడ్ తెలిపారు.

## కులం పేరుతో దూషించి దాడి చేసిన 11 మందికి ఏడాది జైలు శిక్ష...

**మహబూబ్‌నగర్,15(తెలంగాణ ముచ్చట్లు):** మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలంలో ఓ రిపోర్టర్‌పై కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడిన కేసులో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు కీలక తీర్పు వెలువరించింది. కేసును విచారించిన న్యాయస్థానం 11 మంది నిందితులను దోషులుగా తేల్చి, ప్రతి ఒక్కరికి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.20 వేల చొప్పున జరిమానా విధించింది.2021లో అనుమతులు లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపు జరుగుతోందని సంబంధిత అధికారులకు సమాచారం అందించిన రిపోర్టర్‌పై నిందితులు కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై నమోదైన కేసులో ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలు, వాదనలను పరిశీలించిన అనంతరం నిందితులపై నమోదైన అభియోగాలు రుజువైనట్లు కోర్టు నిర్ధారించింది.బాధితుడిపై కులం పేరుతో దూషించడం, దాడికి పాల్పడటం వంటి చర్యలను తీవ్రంగా పరిగణించిన ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు నిందితులకు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.ఈ తీర్పుతో బాధితుడికి న్యాయం జరిగినట్లుగా భావిస్తున్నారు. అక్రమ కార్యకలాపాలను వెలుగులోకి తీసుకొచ్చే పాత్రికేయులపై దాడులు, అలాగే ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల కేసుల్లో చట్టం కఠినంగా అమలవుతుందనే సందేశాన్ని ఈ తీర్పు స్పష్టం చేస్తోందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.








## హరితహారంతో పచ్చదనానికి శ్రీకారం

- పెంచికలపేటలో ఘనంగా హరితహారం కార్యక్రమం

**ఎల్కతుర్తి, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలంలోని పెంచికలపేట గ్రామంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. గ్రామాన్ని పచ్చదనంతో కళకళలాడేలా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ముప్పు శైలజ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని కోరారు. హరితహారం కార్యక్రమం ద్వారా గ్రామంలో పచ్చదనం పెంపొందించి, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. గ్రామాన్ని హరిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ ప్రజలకు మొక్కలను పంపిణీ చేసి, గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొని హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముప్పు శైలజ, ఉపసర్పంచ్ మర్రి అశోక్, గ్రామ కార్యదర్శి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అంబేద్కర్ భవనం, దళిత బంధుపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వినతి

- హుజూరాబాద్ అభివృద్ధి అంశాలపై మంత్రి సానుకూల స్పందన

**హుజురాబాద్ , జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):** హుజూరాబాద్ పట్టణ అభివృద్ధి, దళిత సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ గురువారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.



ఈ సందర్భంగా హుజూరాబాద్ పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమై అసంపూర్తిగా నిలిచిపోయిన అంబేద్కర్ భవన నిర్మాణానికి తక్షణమే పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని ఆయన మంత్రిని కోరారు. అలాగే దళిత బంధు పథకం కింద పెండింగ్‌లో ఉన్న గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన లబ్ధిదారులకు త్వరగా పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా హుజూరాబాద్ నియోజకవర్గంలోని సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన నిధులను విడుదల చేయాలని, వెనుకబడిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ప్రణవ్ కోరారు.

వినతులపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సానుకూలంగా స్పందించారు. హుజూరాబాద్‌కు సంబంధించిన అంశాలపై ఇప్పటికే పలుమార్లు సమీక్షించినట్లు పేర్కొంటూ, అంబేద్కర్ భవనం నిర్మాణం, దళిత బంధు గ్రౌండింగ్ ప్రక్రియ, సంక్షేమ పాఠశాలల అభివృద్ధికి సంబంధించిన విషయాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ భేటీలో హుజూరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా కృషి చేస్తామని మంత్రి పేర్కొన్నట్లు వొడితల ప్రణవ్ తెలిపారు.



## బీజేపీ బలోపేతమే లక్ష్యం.. రాష్ట్ర నాయకత్వంతో రాజేష్ ఠాకూర్

**జమ్మికుంట టౌన్ జులై 16 (తెలంగాణ ముచ్చట్లు):** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో జమ్మికుంట పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు రాజేష్ ఠాకూర్ పాల్గొని పార్టీ బలోపేతం, సంస్థాగత విస్తరణ, ప్రజా సమస్యల పరిష్కారానికి అనుసరించాల్సిన కార్యాచరణపై జరిగిన చర్చల్లో పాల్గొన్నారు.



సమావేశం అనంతరం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు క్రాంతి కుమార్‌ను రాజేష్ ఠాకూర్ మర్యాదపూర్వకంగా కలిసి కరీంనగర్ జిల్లాలో పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, క్షేత్రస్థాయిలో చేపడుతున్న సంస్థాగత కార్యకలాపాలపై వివరించారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న కార్యకర్తలను నాయకులు అభినందిస్తూ, గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా రాజేష్ ఠాకూర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి మరిన్ని అభివృద్ధి నిధులు, మౌలిక వసతుల ప్రాజెక్టులు, సంక్షేమ కార్యక్రమాలు తీసుకురావడంలో పార్టీ రాష్ట్ర నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తామని పేర్కొన్నారు.

రానున్న రోజుల్లో బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత పటిష్ఠం చేయడం, యువత, మహిళలు, ఎస్సీ వర్గాల భాగస్వామ్యాన్ని పెంచడం, కేంద్ర ప్రభుత్వ విజయాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడడం తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తూ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో సేవలు కొనసాగిస్తామని రాజేష్ ఠాకూర్ తెలిపారు.

## ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత తనిఖీలు



- ఇన్స్పెక్టర్ మోహన్ బాబు

**ఖమ్మం బ్యూరో, జులై 16(తెలంగాణ ముచ్చట్లు ):** పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని వివిధ దుకాణాలలో గంజాయిని చాక్లెట్లు, సిగరెట్, పౌడర్ రూపంలో విక్రయిస్తున్నారని సమాచారం మేరకు ఇన్స్పెక్టర్ మోహన్ బాబు ఆధ్వర్యంలో ఖమ్మం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పాడుబడ్డ బంగ్లాలు, నిర్మానుష ప్రాంతాలు, పార్కులు, కిరాణా దుకాణాలు, పాన్‌డబ్బాలలో తనిఖీలు ముమ్మరం చేశారు. గంజాయి హాట్‌స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి సారించి, పాన్‌షాపులు, కిరాణా దుకాణాలు ముసుగులో జరుగుతున్న అక్రమ అమ్మకాలను పోలీసులు పసిగట్టి కఠిన చర్యలు తీసుకుంటున్నారు.







# ఎటువంటి బేషజాలు లేకుండా సీతారామ పనులు పూర్తి చేస్తాం

- **మంత్రి పొంగులేటి**

**ఖమ్మం బ్యూరో, జులై 16(తెలంగాణ ముచ్చట్లు )**

సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. గురువారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన సత్తుపల్లి మండలం యాతాలకుంట టన్నెల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ... తమ ఇందిరమ్మ ప్రభుత్వం ఎటువంటి బేషజాలకు పోకుండా గత పాలకులు నిలిపివేసిన సీతారామ పనులను వేగవంతం చేస్తోందని తెలిపారు. డిజైన్ల మార్పుల పేరుతో కాలయాపన చేసే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. ఈ కరువు కాలంలో కూడా ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదల చేసి రైతులకు అండగా నిలిచామని ఆయన వివరించారు.

అనంతరం ఈ సమీక్షలో సీతారామ భూసేకరణ పనుల కోసం వెంటనే 135 కోట్ల రూపాయలను విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన బిల్లులు సిద్ధం చేసి వెంటనే టోకెన్లు పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. పనుల వేగాన్ని బట్టి ఎప్పటికప్పుడు బిల్లులు క్లియర్ చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్లు దివాకర టిఎస్, అంకిత్, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే డా. తాటికొండ రాజయ్య ఫైర్..

- **ఘనపూర్ అభివృద్ధి శూన్యమని విమర్శ**

**వేలేరు, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండలంలోని మల్లికుదుర్ల, పీచర గ్రామాల్లో ఓటరు జాబితా పరిశీలనలో భాగంగా బీఎల్‌వోలతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే డా. తాటికొండ రాజయ్య అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై తీవ్ర విమర్శలు చేశారు.

ఘనపూర్ నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని, అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. ఘనపూర్‌కు అన్యాయం చేశారని విమర్శిస్తూ, కడియం శ్రీహరికి రాజకీయ సమాధి కట్టాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చినట్లు తెలిపారు.

జూలై 1లోపు వేలేరు మండలంలోని మద్దెలగూడెం, పీచర, శాలపల్లి సహా పలు గ్రామాలకు నీళ్లు అందిస్తామని చెప్పి ఆ హామీని నిలబెట్టుకోలేదని ఆరోపించారు. నియోజకవర్గంలో "కడియం మార్క్" పేరుతో చెప్పుకునే అభివృద్ధి ఏదీ లేదని, ఉంటే నిరూపించాలని సవాల్ విసిరారు



.ఈ కార్యక్రమం లో వేలేరు మండల కన్వీనర్ కోయ్యడ మహేందర్, మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, అధికార ప్రతినిధి మారబోయిన రాజు, గోళ్లేనా రమేష్, సోమిరెడ్డి, విజేందర్ రెడ్డి, భూపతి రాజు, మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి

- **సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్**

**వనపర్తి,జూలై16(తెలంగాణ ముచ్చట్లు):**

స్వదేశీ వస్తువులను ప్రోత్సహించడం ద్వారా దేశీయ పరిశ్రమలకు చేయూత అందించడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించవచ్చని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు.వనపర్తి పట్టణంలో శివరాజ్, నర్సింహ స్వామి, భానుప్రకాష్ సంయుక్తంగా నూతనంగా ఏర్పాటు చేసిన స్వదేశీ మార్ట్ దుకాణాన్ని ఆయన సందర్శించి అభినందించారు.ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ, ముగ్గురు యువకులు కలిసి స్వయం ఉపాధి లక్ష్యంగా వ్యాపార రంగంలో అడుగుపెట్టి



"స్వదేశీ మార్ట్"ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఖాదీ ఉత్పత్తులు, స్వదేశీ వస్తువులు, సేంద్రియ ఆహార పదార్థాలు, ఆర్గానిక్ ఫుడ్స్ విక్రయించడం ద్వారా ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడం సంతోషకరమైన విషయమన్నారు.ప్రతి ఒక్కరూ ఖాదీ, స్వదేశీ వస్తువులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని, సేంద్రియ ఆహారాలను వినియోగించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. స్వదేశీ ఉత్పత్తులకు ఆదరణ పెరిగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.ప్రస్తుతం యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురుచూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని, తాము ఉపాధి పొందడమే కాకుండా మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సామాజికవేత్త గంధం నాగరాజు, శ్రీనివాస్, శివరాజ్, నర్సింహ స్వామి, శేఖర్ ,భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.







# గురుకులాల నిర్లక్ష్యంపై సీపీఎం ఫైర్

- **గురుకులాల్లో మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ**

**హుజురాబాద్, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):**

హుజురాబాద్ నియోజకవర్గంలోని మహాత్మా జ్యోతిరావు పూలే (ఎంజేపీ) గురుకుల విద్యాసంస్థలకు శాశ్వత భవనాలు నిర్మించి, విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గురువారం హుజురాబాద్ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాలలోని పరిస్థితులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం గురుకులాల అభివృద్ధిపై పెద్దఎత్తున ప్రకటనలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మౌలిక వసతుల కల్పనలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

పాఠశాలలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, బయటకు వేలాడుతున్న విద్యుత్ వైర్ల వల్ల విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. తగిన తరగతి గదులు లేక వరండాల్లోనే బోధన కొనసాగుతోందని, వెంటనే కొత్త భవనాలు, తరగతి గదులు నిర్మించాలని కోరారు. ప్రస్తుతం 465 మంది విద్యార్థినులు చదువుతున్న ఈ గురుకులంలో సరైన సౌకర్యాలు లేకపోవడం బాధాకరమన్నారు.

పాఠశాల పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, పాత భవనానికి బదులుగా ఆధునిక శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. భవనాల కొరత కారణంగా కళాశాల తరగతులను అద్దె భవనాల్లో నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకుని గురుకులాలకు శాశ్వత భవనాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల శంకర్, మండల కమిటీ సభ్యులు ప్రతాప్ శ్రీనివాస్, ఇమ్మడి దేవయ్య, కొంకటి చంద్రయ్య, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లూరి కిషోర్, పార్టీ నాయకులు సతీష్, అజ్జు, కుమార్, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# సమృద్ధిగా వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట

- **హుజురాబాద్ 19వ వార్డులో మహిళలు, చిన్నారులతో ప్రత్యేక పూజలు**

**హుజురాబాద్, జూలై 16(తెలంగాణ ముచ్చట్లు ):** సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలోని 19వ వార్డులో కౌన్సిలర్ గోస్కుల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం సంప్రదాయ కప్పతల్లి ఆట నిర్వహించారు.

ఈ సందర్భంగా ముందుగా గ్రామ దేవతలకు జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు, చిన్నారులు కలిసి ఒక కప్పను ప్రతీకగా అలంకరించి, ఇంటింటికీ తిరుగుతూ వర్షదేవుడిని ప్రార్థించే జానపద గీతాలు ఆలపించారు. గ్రామస్తులు సంప్రదాయం ప్రకారం కప్పపై నీళ్లు పోసి, బియ్యం తదితర ధాన్యాలను దానం చేస్తూ కార్యక్రమానికి తమ వంతు సహకారం అందించారు. తరువాత సేకరించిన ధాన్యాలతో సామూహికంగా వంట చేసి నైవేద్యం సమర్పించారు. గ్రామ శ్రేయస్సు, రైతుల సంక్షేమం, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పుష్కలంగా పండాలని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు.

ఈ కార్యక్రమంలో 19వ వార్డు కౌన్సిలర్ గోస్కుల రాజ్‌కుమార్‌తో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, చిన్నారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజాసేవతో పాటు వ్యవసాయానికీ

# సమాన ప్రాధాన్యం

- **తన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి,జూలై16(తెలంగాణ ముచ్చట్లు):**

ప్రజా సేవలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ వ్యవసాయం, పశుపోషణపై తనకున్న మక్కువను వనపర్తి ఎమ్మెల్యే శ్రీ తూడి మేఘారెడ్డి మరోసారి చాటిచెప్పారు. గురువారం ఉదయం దొడగుంటపల్లి శివారులోని తన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి పంటలు, తోటలు, పశుసంపదను పరిశీలించారు.ఈ సందర్భంగా కొబ్బరి, మామిడి, జామ తోటలను పరిశీలించిన ఎమ్మెల్యే మొక్కల పెరుగుదల, నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం వ్యవసాయ క్షేత్రంలో పెంచుతున్న గోవులకు స్వయంగా అరటిపండ్లు తినిపించి వాటి ఆరోగ్య పరిస్థితి, సంరక్షణపై వివరాలు తెలుసుకున్నారు.ప్రస్తుతం వనపర్తి ఎమ్మెల్యేగా ప్రజాసేవలో నిత్యం బిజీగా ఉన్నప్పటికీ, వృత్తిరీత్యా ప్రముఖ కాంట్రాక్టర్ అయిన తూడి మేఘారెడ్డికి వ్యవసాయంపై ఉన్న అభిమానం ఏమాత్రం తగ్గలేదని ఆయన సన్నిహితులు తెలిపారు. రైతు కుటుంబ విలువలను, వ్యవసాయం గొప్పతనాన్ని ఎప్పటికప్పుడు గుర్తు చేసుకుంటూ వ్యవసాయాన్ని తన జీవితంలో విడదీయరాని భాగంగా భావిస్తారని పేర్కొన్నారు.పంటల సంరక్షణతో పాటు పశుసంపద అభివృద్ధిపైనా ప్రత్యేక శ్రద్ధ చూపడం ఆయన ప్రత్యేకతగా చెబుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిత్యం నిమగ్నమై ఉండే ఆయనకు అవకాశం దొరికినప్పుడల్లా తన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి పంటలు, తోటలు, పశువుల సంరక్షణకు కొంత సమయం కేటాయిస్తుంటారు.రైతుల కష్టాలను ప్రత్యక్షంగా అర్థం చేసుకునే నాయకుడిగా, వ్యవసాయాభివృద్ధే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మూలాధారమనే నమ్మకంతో రైతులకు అండగా నిలుస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజా సేవను బాధ్యతగా.. వ్యవసాయాన్ని జీవన విధానంగా భావిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, పశుసంపద పరిరక్షణకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తూ ఆదర్శప్రాయమైన నాయకత్వాన్ని ప్రదర్శిస్తున్నారని కొనియాడుతున్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# పేరుకే సన్నబియ్యం రేషన్ బియ్యంలో
# లక్కపురుగుల కలకలం

**ఎల్కతుర్తి, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):**

ఎల్కతుర్తి మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలకు పంపిణీ చేస్తున్న రేషన్ సన్నబియ్యంలో లక్కపురుగులు కనిపించడం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రభుత్వం నాణ్యమైన సన్నబియ్యాన్ని అందిస్తున్నామని ప్రకటించినప్పటికీ, లబ్ధిదారులకు అందిన బియ్యం సంచుల్లో లక్కపురుగులు, పిండిపిండిగా మారిన బియ్యం కనిపిస్తుండటంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బియ్యం సంచులు తెరిచిన వెంటనే పురుగులు బయటకు వస్తున్నాయని, బియ్యం నాణ్యత పూర్తిగా దెబ్బతిన్నట్లు ఉందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇలాంటి బియ్యాన్ని తినడం వల్ల చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు సహా కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకానికి ఇలాంటి ఘటనలు చెడ్డపేరు తీసుకొస్తున్నాయని ప్రజలు అంటున్నారు. పంపిణీకి ముందు సంబంధిత అధికారులు బియ్యం నాణ్యతను పరిశీలించకుండా నిర్లక్ష్యంగా పంపిణీ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

పురుగులు పట్టిన బియ్యాన్ని వెంటనే వెనక్కి తీసుకుని నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేయాలని, రేషన్ బియ్యం నిల్వ, రవాణా, పంపిణీ వ్యవస్థపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడకుండా నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఇందిరమ్మ కాలనీలో నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటుకు చర్యలు..

- **విద్యుత్ అధికారులతో కలిసి పరిశీలించిన..**
- **వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్..**

**ఖమ్మం బ్యూరో,జూలై 16(తెలంగాణ ముచ్చట్లు )**

వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు ఇందిరమ్మ కాలనీలో నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటుకు చర్యలు వేగవంతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ బుధవారం విద్యుత్ శాఖ అధికారులతో కలిసి కాలనీలో విస్తృతంగా పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



ఈ సందర్భంగా ఇంటి పై నుంచి ప్రమాదకరంగా వెళ్తున్న విద్యుత్ వైర్ల తొలగింపు, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు, అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్ లైన్ల నిర్మాణం, నిరుపయోగంగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. కాలనీలో ఎన్ని కొత్త స్తంభాలు అవసరమవుతాయో, ఏయే ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలనే విషయాలపై అధికారులు అంచనా (ఎస్టిమేట్) సిద్ధం చేశారు.

ఈ సందర్భంగా కట్ల సంతోష్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదేశాల మేరకు ఇందిరమ్మ కాలనీలో ప్రతి గల్లీకి విద్యుత్ సౌకర్యం కల్పించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితమైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన అన్ని పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు.

ఈ పరిశీలనలో విద్యుత్ శాఖ డీఈ రమేష్, ఏడీఈ కిరణ్, సబ్ ఇంజనీర్ నరేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ జార్జ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లి ధరలతో సామాన్యులకు భారమే

**న్యూఢిల్లీ, జులై 16 (తెలంగాణ ముచ్చట్లు):**

మార్కెట్‌లో ఉల్లిపాయల ధరలు ఒక్కసారిగా పెరగడంతో సామాన్యులపై అదనపు భారం పడుతోంది. కొద్ది నెలల క్రితం తక్కువ ధరకే లభించిన ఉల్లిపాయలు ప్రస్తుతం గణనీయంగా ఖరీదవడంతో కుటుంబాల నెలవారీ వంటగది వ్యయం పెరిగింది. రైతులకు గిట్టుబాటు ధర లభిస్తున్నప్పటికీ, వినియోగదారులు మాత్రం అధిక ధరలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మే నెలలో క్వింటా ఉల్లి ధర రూ.1,500లోపే ఉండగా, ప్రస్తుతం అది రూ.3,000 నుంచి రూ.3,300 వరకు చేరింది. ప్రభుత్వం కనీస మద్దతు ధరను క్వింటాకు రూ.2,125కు పెంచడం, మార్కెట్‌కు



సరుకు రాక తగ్గడం, డిమాండ్ పెరగడం వంటి కారణాలతో ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. టోకు మార్కెట్‌లో ధరలు పెరగడంతో చిల్లర మార్కెట్‌పైనా అదే ప్రభావం కనిపిస్తోంది.

ప్రస్తుతం చిల్లర మార్కెట్‌లో కిలో ఉల్లిపాయ ధర రూ.35 నుంచి రూ.40 వరకు పలుకుతోంది. నెల రోజుల క్రితం రూ.100కు నాలుగు నుంచి ఐదు కిలోల వరకు లభించిన ఉల్లిపాయలు, ఇప్పుడు అదే మొత్తానికి రెండున్నర కిలోలకే పరిమితమయ్యాయి. నిత్యావసర కూరగాయల్లో ప్రధానమైన ఉల్లి ధరలు పెరగడంతో మధ్యతరగతి, పేద కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. రానున్న రోజుల్లో సరఫరా పెరిగితే ధరలు కొంత తగ్గే అవకాశం ఉందని, లేకపోతే ఇదే పరిస్థితి కొనసాగవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## బొగ్గు రంగంపై సమీక్ష

- **ఉత్పత్తి పెంపుపై దృష్టి**
- **ఇంధన భద్రతకు వ్యూహాలు**
- **కేంద్ర మంత్రి కీలక సమావేశం**

**న్యూఢిల్లీ, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి న్యూఢిల్లీలో బొగ్గు రంగ పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర సహాయ మంత్రి సతీశ్ దూబే, బొగ్గు మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో కలిసి బొగ్గు ఉత్పత్తి, సరఫరా, కీలక కార్యక్రమాల అమలును సమీక్షించారు. సమావేశంలో దేశవ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తి, రవాణా, పంపిణీ వ్యవస్థల పురోగతిపై అధికారులు మంత్రికి వివరించారు. బొగ్గు రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు చేపడుతున్న కార్యక్రమాల అమలు తీరును సమీక్షించి, లక్ష్యాల సాధనపై దృష్టి సారించారు. బొగ్గు గనుల్లో కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచడం, ఉత్పాదకతను మెరుగుపరచడం, ఆధునిక సాంకేతికత వినియోగాన్ని విస్తరించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు.




బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను మరింత సమర్థవంతంగా మార్చేందుకు అవసరమైన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు.

దేశంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. స్థిరమైన, విశ్వసనీయ ఇంధన సరఫరా కోసం దీర్ఘకాలిక ప్రణాళికలను వేగవంతం చేయాలని సూచించారు. బొగ్గు రంగంలో కొనసాగుతున్న కీలక కార్యక్రమాల అమలు, ఉత్పత్తి లక్ష్యాలు, సరఫరా వ్యవస్థల సామర్థ్యంపై కూడా సమావేశంలో సమగ్రంగా చర్చించారు. వివిధ ప్రాజెక్టుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దేశ ఇంధన భద్రతను మరింత పటిష్ఠం చేయడంలో బొగ్గు రంగం కీలక పాత్ర పోషిస్తోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, సామర్థ్యాన్ని పెంచుతూ దేశ అభివృద్ధికి బొగ్గు రంగం మరింత దోహదపడేలా చర్యలు కొనసాగుతాయని తెలిపారు.



## ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం..

- **20వ వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు**
- **20వ వార్డులో ఉచిత వైద్య శిబిరం..**

**ఖమ్మం బ్యూరో, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు )**

వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లయన్ ఐ కేర్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వార్డుకు చెందిన ప్రజలకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. రక్తపోటు, మధుమేహం, జ్వరం, దగ్గు, జలుబు తదితర సీజనల్ వ్యాధులపై వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించి, తగిన జాగ్రత్తలు సూచించారు.

ఈ సందర్భంగా కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నపాటి అనారోగ్య లక్షణాలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని, స్వయంగా మందులు వాడకుండా నిపుణుల సలహా మేరకే చికిత్స తీసుకోవాలని అన్నారు.

ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని, అవసరమైన వారికి మందులు అందజేయడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సీజనల్ వ్యాధుల నివారణలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా కీలకమని, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని చెప్పారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎల్లప్పుడూ తమ వంతు కృషి కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో లయన్ ఐ కేర్ నిర్వాహకులు ఉండ్రు శ్యాంబాబు, వైద్య సిబ్బంది దుర్గా మల్లేశ్వరి, శ్రీలత, శృతి, సుగుణ, నవీనతో పాటు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## పింక్ బాస్కెట్‌తో కొత్త పరిచయాలు

- **ఫిన్లాండ్‌లో వినూత్న ప్రయోగం**
- **ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తింపు**

**హెల్సింకి, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆన్‌లైన్ డేటింగ్ యాప్‌లకు ప్రత్యామ్నాయంగా నిజ జీవితంలో కొత్త వ్యక్తులను సహజంగా కలిసే అవకాశాన్ని కల్పించే వినూత్న ప్రయోగానికి ఫిన్లాండ్‌లోని కొన్ని సూపర్ మార్కెట్లు శ్రీకారం చుట్టాయి. 'పింక్ బాస్కెట్' పేరుతో ప్రారంభించిన ఈ కార్యక్రమం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. డిజిటల్ పరిచయాల కంటే ప్రత్యక్షంగా కొత్త వ్యక్తులతో మాట్లాడేందుకు ఆసక్తి ఉన్నవారికి ఇది ప్రత్యేక సంకేతంగా ఉపయోగపడుతోంది.

ఫిన్లాండ్‌లోని 'కేసూపర్ మార్కెట్', 'ఎస్‌మార్కెట్' వంటి కొన్ని రిటైల్ స్టోర్లలో సాధారణ షాపింగ్ బాస్కెట్లతో పాటు గులాబీ రంగు బాస్కెట్లను కూడా అందుబాటులో ఉంచారు. ఎవరైనా ఈ పింక్ బాస్కెట్‌ను తీసుకుని షాపింగ్ చేస్తే, వారు ఒంటరిగా ఉన్నారని, కొత్త వ్యక్తులతో పరిచయం పెంచుకోవడానికి ఆసక్తిగా ఉన్నారని భావిస్తారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా సహజమైన పరిచయాలకు ఇది ఒక అవకాశంగా నిలుస్తోంది.

ఈ వినూత్న విధానం సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం పొందింది. ఫిన్లాండ్‌లో షాపింగ్ చేస్తున్న సమయంలో ఈ బాస్కెట్లను గమనించిన సోషల్ మీడియా వినియోగదారు రోయా ఫాక్స్ దీనిపై వీడియో రూపొందించి పంచుకున్నారు. సూపర్ మార్కెట్‌లో పింక్ బాస్కెట్ తీసుకుంటే కొత్త వ్యక్తులను కలిసే అవకాశం ఉంటుందని ఆమె చెప్పడంతో ఆ వీడియో లక్షలాది మంది దృష్టిని ఆకర్షించింది. దీంతో ఈ ఆలోచనపై ప్రపంచవ్యాప్తంగా చర్చ మొదలైంది.

ఈ విధానాన్ని నెటిజన్లు విస్తృతంగా ప్రశంసిస్తున్నారు. "ఇలాంటి ఆలోచన మా దేశంలో కూడా రావాలి", "డేటింగ్ యాప్‌ల కంటే ఇది ఎంతో సహజమైన మార్గం" అంటూ సామాజిక మాధ్యమాల్లో స్పందనలు వెల్లువెత్తుతున్నాయి. డిజిటల్ యుగంలో మనుషుల మధ్య ప్రత్యక్ష సంబంధాలను పెంపొందించే ప్రయత్నంగా పలువురు దీనిని అభివర్ణిస్తున్నారు.

అంతర్జాతీయ మీడియా సంస్థలు కూడా ఈ కార్యక్రమంపై ప్రత్యేక కథనాలు ప్రచురించాయి. అయితే ఇది ఫిన్లాండ్ ప్రభుత్వ కార్యక్రమం కాదని, అక్కడి కొన్ని సూపర్ మార్కెట్లు స్వచ్ఛందంగా చేపట్టిన వినూత్న ప్రయత్నమని స్పష్టం చేశాయి. వినియోగదారుల మధ్య సహజమైన పరిచయాలకు వేదిక కల్పించడమే దీని ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నాయి.

# నెలరోజులు ఎర్రకోట మూసివేత

- స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లు
- భద్రతకు అత్యంత ప్రాధాన్యం

**న్యూఢిల్లీ, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):**

దేశ రాజధానిలోని చారిత్రాత్మక ఎర్రకోటను నెల రోజుల పాటు సాధారణ సందర్శకులకు మూసివేస్తూ భారత పురావస్తు శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. జూలై 15 నుంచి ఆగస్టు 15 వరకు ఎర్రకోటలోకి పర్యాటకుల ప్రవేశాన్ని నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు, భద్రతా చర్యల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట ప్రధాన వేదికగా ఉండటంతో భద్రతను అత్యంత కట్టుదిట్టం చేశారు. ప్రస్తుతం అనుమతిపత్రాలు ఉన్న అధికారులు, సిబ్బంది, ఏర్పాట్లలో పాల్గొనే వారికి మాత్రమే లోనికి అనుమతి ఇస్తున్నారు. సాధారణ ప్రజలు, పర్యాటకుల ప్రవేశంపై పూర్తి నిషేధం అమలు చేస్తున్నారు. ప్రతి ఏడాది ఆగస్టు 15న దేశ ప్రధానమంత్రి



ఎర్రకోటపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమానికి దేశ విదేశాల నుంచి ప్రత్యేక అతిథులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, రక్షణ దళాల ప్రతినిధులు హాజరవుతారు. దీంతో భద్రతా ఏర్పాట్లను ముందుగానే ప్రారంభించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

ఈ ఏడాది కూడా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. వేలాది మంది భద్రతా సిబ్బంది, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. ఎర్రకోట పరిసర ప్రాంతాల్లో భద్రతా తనిఖీలు, పర్యవేక్షణ చర్యలను మరింత ముమ్మరం చేశారు. ఎర్రకోట మూసివేత కారణంగా ఈ కాలంలో పర్యాటకులు ప్రత్యామ్నాయ చారిత్రక ప్రాంతాలను సందర్శించాలని అధికారులు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ముగిసిన అనంతరం ఆగస్టు 16 నుంచి ఎర్రకోటను తిరిగి సందర్శకులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. దేశ గౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు సహకరించాలని భారత పురావస్తు శాఖ విజ్ఞప్తి చేసింది. భద్రతా కారణాల రీత్యా తీసుకున్న ఈ నిర్ణయాన్ని అందరూ గౌరవించి సహకరించాలని అధికారులు కోరారు.

# రాహుల్‌తో కాంగ్రెస్ అగ్రనేతల సమీక్ష

- రాజకీయ పరిస్థితులపై చర్చ
- పార్టీ బలోపేతంపై మంతనం

**న్యూఢిల్లీ, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):**

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో న్యూఢిల్లీలోని 10 జనపథ్ నివాసంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సమావేశమయ్యారు. పార్టీ సంస్థాగత వ్యవహారాలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు. సమావేశంలో పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేసే అంశాలపై విస్తృతంగా మంతనాలు జరిగాయి. దేశంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై



నాయకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, నాయకులు, కార్యకర్తల సమన్వయాన్ని పెంపొందించడం వంటి అంశాలపై సమావేశంలో ప్రత్యేకంగా చర్చించినట్లు సమాచారం. ప్రజలతో మరింత చేరువయ్యే కార్యాచరణపై కూడా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

ఈ సమావేశంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సుర్జేవాలా, కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పాల్గొన్నారు. పార్టీకి సంబంధించిన పలు వ్యూహాత్మక అంశాలపై వారు రాహుల్ గాంధీతో చర్చించారు. రాష్ట్రాల వారీగా పార్టీ పరిస్థితి, సంస్థాగత బలోపేతం, రాజకీయ సవాళ్లను ఎదుర్కొనే వ్యూహాలపై కూడా సమావేశంలో సమీక్ష నిర్వహించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. భవిష్యత్ కార్యక్రమాల అమలుపై నాయకులు పరస్పరం సూచనలు చేసుకున్నారు. దేశవ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నాయకులు అభిప్రాయపడ్డారు. పార్టీ కార్యాచరణను క్షేత్రస్థాయిలో మరింత సమర్థంగా అమలు చేయడంపై కూడా చర్చ జరిగినట్లు వెల్లడించారు.

# డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం కోరిన ఖర్గే

- ప్రధానికి లేఖ రాసిన కాంగ్రెస్ అధ్యక్షుడు
- బిల్లుపై ముందస్తు చర్చలకు విజ్ఞప్తి
- పార్టీలకు అధ్యయనానికి అవకాశం ఇవ్వాలని డిమాండ్

**న్యూఢిల్లీ, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న సవరించిన డీలిమిటేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు గురువారం ప్రధానికి లేఖ రాసిన ఆయన, బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ముందు అన్ని రాజకీయ పార్టీలతో విస్తృతంగా చర్చించాలని విజ్ఞప్తి చేశారు.

సవరించిన డీలిమిటేషన్ ప్రతిపాదనలు, వాటికి సంబంధించిన అంశాలపై రాజకీయ పార్టీలకు పూర్తి సమాచారం అందించాలని ఖర్గే కోరారు. బిల్లులను సభలో ప్రవేశపెట్టే ముందు వాటిని పరిశీలించేందుకు, అధ్యయనం చేసేందుకు తగిన సమయం కల్పించాలని లేఖలో పేర్కొన్నారు.

డీలిమిటేషన్ ప్రతిపాదనలపై ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో కూడా అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి పలుమార్లు లేఖలు రాసినా స్పందన రాలేదని ఖర్గే తెలిపారు. తమ అభ్యర్థనలను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు2026కు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించకపోవడంతో అది ఆమోదం పొందలేదని ఖర్గే గుర్తు చేశారు. అదే బిల్లును సవరించి వర్షాకాల సమావేశాల్లో మళ్లీ ప్రవేశపెట్టనున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయని పేర్కొన్నారు.

డీలిమిటేషన్ బిల్లు2026తో పాటు కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు 2026 కూడా ఏప్రిల్‌లో ఆమోదం పొందలేదని ఆయన గుర్తు చేశారు. ఈ ప్రతిపాదనల ద్వారా లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళల రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడంతో పాటు లోక్‌సభ స్థానాల సంఖ్యను 850కు పెంచడం, 1976 తర్వాత తొలిసారిగా దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టే అవకాశం ఉందని వివరించారు.



ఈ నేపథ్యంలో పార్లమెంట్‌లో బిల్లులను ప్రవేశపెట్టే ముందు అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఏకాభిప్రాయం సాధించాలని ఖర్గే ప్రధానికి విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుగుణంగా సంప్రదింపుల ప్రక్రియ నిర్వహించాలని ఆయన కోరారు.

# వ్యూహాత్మక మౌలిక సదుపాయాల సదస్సు

- బీఆర్‌వో సేవలకు రాజ్‌నాథ్ ప్రశంస
- సాంకేతికతతో మౌలిక వసతుల బలోపేతం
- అవార్డు గ్రహీతలకు అభినందనలు

**న్యూఢిల్లీ, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):**

సరిహద్దు రహదారుల సంస్థ (బీఆర్‌వో) నిర్వహించిన వ్యూహాత్మక మౌలిక సదుపాయాల సదస్సులో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. దేశ వ్యూహాత్మక మౌలిక సదుపాయాలను సాంకేతికత, ఆవిష్కరణలు, డిజిటల్ పరివర్తన, సమర్థ అమలుతో మరింత బలోపేతం చేయాలనే సంకల్పాన్ని ఈ సదస్సు పునరుద్ఘాటించిందని ఆయన తెలిపారు. దేశ భద్రత, అభివృద్ధికి అవసరమైన వ్యూహాత్మక మౌలిక సదుపాయాల నిర్మాణంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. సదస్సులో జరిగిన చర్చలు, భాగస్వామ్యాలు దేశ సామర్థ్యాలను మరింత పెంచేందుకు దోహదపడతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

మౌలిక సదుపాయాల నిర్మాణంలో నాణ్యత, వేగం, సాంకేతికతకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర రక్షణ మంత్రి సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి జాతీయ భద్రతను మరింత బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. సదస్సులో విశిష్ట సేవలు అందించిన అధికారులకు, సిబ్బందికి ప్రదానం చేసిన అవార్డులను ప్రస్తావిస్తూ విజేతలందరికీ రాజ్‌నాథ్ సింగ్ అభినందనలు తెలిపారు. వారి అంకితభావం, కృషి దేశ నిర్మాణంలో ఆదర్శప్రాయమని కొనియాడారు. సరిహద్దు రహదారుల సంస్థ దేశానికి బలమైన, సురక్షితమైన, స్వావలంబన కలిగిన మౌలిక వసతులను నిర్మించే దిశగా విశేష సేవలు అందిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. భవిష్యత్తులో కూడా అదే స్ఫూర్తితో



ముందుకు సాగాలని బీఆర్‌వో బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

న్యూఢిల్లీలో జరిగిన ఈ వ్యూహాత్మక మౌలిక సదుపాయాల సదస్సులో బీఆర్‌వో అధికారులు, నిపుణులు, వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు. దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధికి సాంకేతికత, వినూత్న ఆలోచనల వినియోగంపై విస్తృతంగా చర్చించారు.

# హర్మూజ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

- ఇరాన్‌పై అమెరికా రెండో దాడి
- శాంతి ఒప్పందంపై సందిగ్ధం

**వాషింగ్టన్, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):**



అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రరూపం దాల్చాయి. వ్యూహాత్మకంగా కీలకమైన హర్మూజ్ జలసంధి ప్రాంతంలో ఇరాన్‌పై రెండో విడత వైమానిక దాడులు నిర్వహించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈ దాడులతో పశ్చిమాసియాలో భద్రతా పరిస్థితులు మళ్లీ ఆందోళనకరంగా మారగా, ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

అమెరికా కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున ఈ దాడులు జరిగినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే అంతర్జాతీయ నౌకలకు ముప్పుగా మారిన ఇరాన్ సైనిక సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేపట్టినట్లు పేర్కొంది. సముద్ర రవాణా భద్రతను కాపాడడమే ఈ చర్యల ఉద్దేశమని అమెరికా వెల్లడించింది. దాడులకు ముందు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బేకర్ ఖలీబాఫ్ అమెరికాకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిపై ఇరాన్ ఆధిపత్యం తమ జాతీయ భద్రతలో కీలక భాగమని స్పష్టం చేశారు. దేశ ప్రయోజనాలు, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అవసరమైతే యుద్ధానికైనా సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. అయితే దౌత్యపరమైన చర్చలకు కూడా తాము ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

ఇటీవల జూన్ 18న ఇరాన్-అమెరికా మధ్య యుద్ధ విరమణ దిశగా తాత్కాలిక అవగాహన ఏర్పడింది. 60 రోజుల్లో తుది ఒప్పందంపై చర్చలు జరపాలని నిర్ణయించినప్పటికీ, ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణలు ఆ ప్రక్రియను సంక్షోభంలోకి నెట్టాయి. ఒప్పందం వల్ల ఇరాన్‌కు ప్రయోజనం లేకపోతే దానికి కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని ఖలీబాఫ్ స్పష్టం చేశారు. తాజా వైమానిక దాడుల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక అవగాహన దెబ్బతిన్నట్లు అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. హర్మూజ్ జలసంధి కేంద్రంగా నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ చమురు సరఫరా, సముద్ర రవాణాపై ప్రభావం చూపే అవకాశముందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పరిస్థితిని ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి.



# వాంగ్‌చుక్ ఆరోగ్యంపై ఆందోళన

- ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశాలు
- ప్రతి ప్రాణం విలువైందే

**న్యూఢిల్లీ, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):**

పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 19వ రోజుకు చేరిన నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని ప్రతిరోజూ ప్రభుత్వ వైద్యులు పర్యవేక్షించాలని, అవసరమైతే వెంటనే వైద్య చికిత్స అందించాలని కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వాలను ఆదేశించింది. "ప్రతి పౌరుడి ప్రాణం విలువైనదే" అని న్యాయస్థానం స్పష్టం చేసింది. జూన్ 28 నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. నీట్ పరీక్షలో జరిగినట్లు ఆరోపణలు వచ్చిన అక్రమాలపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఈ దీక్షకు పలువురు విద్యార్థి సంఘాలు, సామాజిక సంస్థలు, ప్రముఖులు మద్దతు ప్రకటించారు.

దీర్ఘకాలంగా ఆహారం తీసుకోకపోవడంతో వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఇప్పటికే ఆయన బరువు గణనీయంగా తగ్గిందని, శరీర అవయవాల పనితీరుపై ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పరిస్థితి మరింత విషమించకుండా వెంటనే వైద్య పర్యవేక్షణ అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని విచారించిన ఢిల్లీ హైకోర్టు, కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ నుంచి వివరాలు తెలుసుకుంది. రోజువారీగా ప్రభుత్వ వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన వైద్య జోక్యం కూడా చేపడతామని ప్రభుత్వం కోర్టుకు హామీ ఇచ్చింది.

వాంగ్‌చుక్ దీక్షను విరమించాలని పలువురు ప్రతిపక్ష నాయకులు, సామాజిక కార్యకర్తలు, ప్రముఖులు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ, ఆయన తన ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. విద్యార్థుల ప్రయోజనాల కోసం, పరీక్షల పారదర్శకత కోసం పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామాలతో దేశవ్యాప్తంగా వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవైపు న్యాయస్థానం ప్రభుత్వాలను అప్రమత్తం చేస్తుండగా, మరోవైపు ఆయన చేపట్టిన నిరాహార దీక్షపై రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. ఆరోగ్య రక్షణతో పాటు సమస్య పరిష్కారానికి చర్చల ద్వారా మార్గం కనుగొనాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# పూరీ రథయాత్రలో విషాదం

- భక్తుల రద్దీతో తొక్కిసలాట
- ఊపిరాడక వృద్ధుడి మృతి
- వందలాది మందికి అస్వస్థత

**పూరీ, జూలై 16 (తెలంగాణ ముచ్చట్లు):**

ఒడిశాలోని పూరీలో గురువారం నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో విషాదం చోటుచేసుకుంది. భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తుల రద్దీ కారణంగా తొక్కిసలాటలాంటి పరిస్థితులు ఏర్పడి ఓ వృద్ధుడు మృతి చెందినట్లు సమాచారం. పలువురు భక్తులు గాయపడగా, వందలాది మంది అస్వస్థతకు గురయ్యారు. మారిచికుండ్ కూడలి వద్ద భక్తులను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన తాళ్ల బారికేడ్ కూలిపోవడం లేదా కొందరు భక్తులు పట్టుతప్పి కిందపడిపోవడంతో ఒకరిపై ఒకరు పడిపోయారు. దీంతో సుమారు 40 నుంచి 50 మంది భక్తులు ఒకేచోట పడిపోగా, పలువురు గాయాలపాలయ్యారు. వారిలో నలుగురు నుంచి ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సమాచారం అందుకున్న సహాయక బృందాలు వెంటనే స్పందించి సుమారు 20 మంది భక్తులను రక్షించి అంబులెన్స్‌లలో సమీప ఆసుపత్రులకు తరలించాయి. చికిత్స పొందుతున్న వారిలో ఓ వృద్ధుడు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన క్షతగాత్రులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. భారీ జనసందోహం, కుండపోత వర్షం కారణంగా ఊపిరాడకపోవడం, స్వల్ప గాయాల కారణంగా సుమారు 200 మంది భక్తులు పూరీలోని వివిధ ఆసుపత్రులు, తాత్కాలిక వైద్య శిబిరాల్లో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. భక్తుల రద్దీని నియంత్రించేందుకు అదనపు భద్రతా సిబ్బందిని రంగంలోకి దించారు.

ఇంతకుముందు గురువారం ఉదయం నిర్ణీత సమయం కంటే ముందుగానే పహండీ బిజే క్రతువుతో జగన్నాథ రథయాత్ర ప్రారంభమైంది. అయితే భారీగా భక్తులు తరలిరావడంతో రథాల ఊరేగింపు పూర్తికావడానికి రెండు గంటలకు పైగా ఆలస్యమైనట్లు అధికారులు తెలిపారు. ఘటనపై అధికారులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. భక్తుల భద్రతకు మరిన్ని చర్యలు చేపడుతూ రథయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అదనపు భద్రతా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.




తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# డిసెంబర్ 3న ప్రేక్షకుల ముందుకు ఫౌజీ

పాన్ ఇండియా కథానాయకుడు ప్రభాస్ ప్రధాన పాత్రలో హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫౌజీ' చిత్ర విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది.

విడుదల తేదీ ప్రకటనతో పాటు చిత్రబృందం కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేసింది. అందులో ప్రభాస్ కొత్త రూపంలో కనిపించగా, అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. పోస్టర్ విడుదలైన కొద్దిసేపటికే సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమైంది. భారీ వ్యయంతో రూపొందుతున్న ఈ కాలానుగుణ యాక్షన్ కథాచిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం విడుదల తర్వాత వసూళ్ల పరంగా కొత్త మైలురాళ్లు నెలకొల్పుతుందనే ఆశాభావాన్ని సినీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.



# ప్రేక్షకుల ప్రేమే నా బలం: కిరణ్ అబ్బవరం

గత ఐదారు సంవత్సరాలుగా ప్రేక్షకుల నుంచి అపారమైన ప్రేమాభిమానాలు అందుకున్నానని, మంచి చిత్రాలతో వారి ఆదరణను మరింతగా పొందేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న *చెన్నై ప్రేమకథ' ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. తన జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ చిత్రంలో స్వచ్ఛమైన ప్రేమకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు.

ఒక యువతి కోసం ఎంత గొప్పగా ప్రేమించవచ్చో ఈ కథలో చూపించామని, ప్రేమతో పాటు ప్రేక్షకులను అలరించే మాస్ అంశాలు కూడా చిత్రంలో ఉన్నాయని తెలిపారు. ప్రతి వర్గం ప్రేక్షకులను ఆకట్టుకునేలా చిత్రాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు.

నిర్మాత ఎస్.కే.ఎన్. మాట్లాడుతూ, ఈ చిత్రం ప్రేక్షకుల హృదయాలను తాకే ప్రేమకథగా నిలుస్తుందని చెప్పారు. దర్శకుడు రవి నంబూరి మాట్లాడుతూ, ప్రధాన



పాత్రల భావోద్వేగాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటాయని తెలిపారు. ఈ చిత్రంలో శ్రీగౌరి ప్రియ కథానాయికగా నటించగా, సంగీతాన్ని మణిశర్మ సమకూర్చారు.




# ఆగస్టు 15న హుషారు పిట్టలు విడుదల

అన్షు, వాసవి గణేషన్ ప్రధాన పాత్రల్లో నటించిన 'హుషారు పిట్టలు' చిత్రం ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. బిక్షు దర్శకత్వంలో వెంకట్ యాదవ్ నిర్మించిన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు విడుదల చేయనున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు విశేష స్పందన లభించగా, తాజాగా 'టోంగా టోంగా' గీతాన్ని చిత్రబృందం ఆవిష్కరించింది.

ఈ సందర్భంగా దర్శకుడు బిక్షు మాట్లాడుతూ, టీజర్ విడుదల తర్వాత వచ్చిన విమర్శలే తన చిత్రానికి మరింత గుర్తింపు తెచ్చాయని అన్నారు. సినిమా విడుదలైన తర్వాత కథలోని అసలు ఉద్దేశం ప్రేక్షకులకు అర్థమవుతుందని, ప్రస్తుతం చేస్తున్న విమర్శలను చాలామంది వెనక్కి తీసుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. ఈ చిత్రం తెలుగు చిత్రసీమలో కొత్త ధోరణికి నాంది పలుకుతుందని తెలిపారు.

కథానాయకుడు అన్షు మాట్లాడుతూ, ఈ చిత్రంలోని కథ, సంగీతం తనలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపాయని అన్నారు. కథలోని అసలు బలం సినిమా చూసిన తర్వాతే ప్రేక్షకులకు తెలుస్తుందని చెప్పారు. కథానాయిక వాసవి గణేషన్ మాట్లాడుతూ, టీజర్ చూసి తన పాత్రపై వచ్చిన అపోహలు సినిమా విడుదలైన తర్వాత తొలగిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ మాట్లాడుతూ, ఈ చిత్రంలోని పాటలు అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని తెలిపారు. నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ, ఎన్నో కష్టాల మధ్య నిర్మించిన ఈ చిత్రం ప్రేక్షకుల హృదయాలను తాకుతుందనే నమ్మకం ఉందన్నారు. చిన్న చిత్రమైనప్పటికీ మంచి కథతో రూపొందిన ఈ సినిమాకు ప్రేక్షకుల ఆదరణ లభిస్తుందని చిత్రబృందం ఆశాభావం వ్యక్తం చేసింది.




# రజనీకాంత్ చిత్రంలో రుక్మిణికి అవకాశం

కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు వరుసగా భారీ చిత్రాల్లో అవకాశాలు దక్కుతున్నాయి. ఇప్పటికే యశ్ నటిస్తున్న 'టాక్సిక్', ఎన్టీఆర్ నటిస్తున్న *'డ్రాగన్' చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్న ఆమెకు తాజాగా రజనీకాంత్ కథానాయకుడిగా రూపొందనున్న 'ధర్మన్ – ది డెడ్లీ డాక్టర్' చిత్రంలోనూ కీలక పాత్ర లభించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ఈ చిత్రంలో రుక్మిణి పాత్ర కథలో ఎంతో ప్రాధాన్యంతో సాగుతుందని సమాచారం. సిమ్రాన్ కథానాయికగా నటిస్తుండగా, రాశీ ఖన్నా మరో కీలక పాత్రలో కనిపించనున్నారు. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రాన్ని తెరకెక్కించనుండగా, త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది.

ఈ చిత్ర నిర్మాణ బాధ్యతలను ప్రముఖ నటుడు కమల్ హాసన్ చేపట్టగా, సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ సమకూరుస్తున్నారు. వరుసగా ప్రతిష్ఠాత్మక చిత్రాల్లో అవకాశాలు దక్కించుకుంటున్న రుక్మిణి వసంత్ ప్రస్తుతం దక్షిణ భారత చిత్రసీమలో అత్యంత బిజీ కథానాయికలలో ఒకరిగా నిలుస్తున్నారు.



# 'అయ్యగారే నెంబర్ వన్' ఫ్యాన్‌తో భేటీ

అక్కినేని అఖిల్ తన అభిమానిపై చూపిన ఆప్యాయతతో మరోసారి అభిమానుల మనసులు గెలుచుకున్నారు. సోషల్ మీడియాలో 'అయ్యగారే నెంబర్ వన్' అంటూ ప్రసిద్ధి చెందిన గుంటూరుకు చెందిన వీరాభిమాని నాగరాజును బుధవారం వ్యక్తిగతంగా కలుసుకుని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఇటీవల విడుదలైన 'లెనిన్' సినిమా సందర్భంగా నాగరాజు థియేటర్ల వద్ద కటౌట్‌లకు పాలాభిషేకాలు చేయడం, ప్రత్యేక పూజలు నిర్వహించడం వంటి దృశ్యాలు వైరల్ కావడంతో అఖిల్ దృష్టికి చేరాయి. అప్పట్లో అవకాశం దొరికితే కలుస్తానని హామీ ఇచ్చిన అఖిల్, ఇప్పుడు నాగరాజును ప్రత్యేకంగా ఆహ్వానించారు. అభిమాన హీరోను చూసిన ఆనందంలో నాగరాజు భావోద్వేగానికి గురై అఖిల్ కాళ్లపై పడేందుకు ప్రయత్నించగా, వెంటనే అతన్ని ఆపి ప్రేమగా ఆలింగనం చేసుకున్నారు. "ఈ జన్మకు ఇది చాలు" అంటూ నాగరాజు ఆనందభాష్పాలు పెట్టుకున్నాడు.

ఈ భేటీకి సంబంధించిన వీడియోను అన్నపూర్ణ స్టూడియోస్ సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో అది వేగంగా వైరల్ అయింది. అభిమానులకు ఇంత విలువ ఇవ్వడం అభినందనీయమని పలువురు సినీప్రియులు అఖిల్‌ను ప్రశంసిస్తున్నారు. పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగించే నాగరాజు, సినిమా విడుదలల సమయంలో మాత్రమే అభిమానిగా కనిపిస్తూ, ఇతర వివాదాలకు దూరంగా ఉండడం కూడా పలువురి ప్రశంసలు అందుకుంటోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in